మురుగు.. పరుగు

- రోడ్లపైనే నిలుస్తున్న మురికి నీరు
- అధ్వానంగా డ్రైనేజీ, అంతర్గత రోడ్లు
- ఇందిరమ్మకాలనీలో సౌకర్యాలు కరువు

జ్యోతినగర్: అయ్యా గత పాలకులు పోయారు.. కొత్త పాలకులు వచ్చారు. కానీ ఇందిరమ్మకాలనీలో సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామగుండం కార్పొరేషన్‌లోని రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీ శివారు ప్రాంతం పూర్తిగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. నివాస గృహాల మధ్య అంతర్గత రోడ్లు లేవు, రోడ్డు పక్కన సైడ్‌కాలువలు లేవు, సబ్‌స్టేషన్ రోడ్డు పూర్తిగా బురదగా మారిపోయింది. వర్షాలు తగ్గినా ఇంకా రోడ్డుపై బురద తొలగడం లేదు. డివిజన్ సమస్యలను అధికారులు, పాలకులు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపైనే మురుగు..

రెండో డివిజన్‌లోని ఇందిరమ్మకాలనీ ప్రజల మౌలిక వసతుల కల్పనపై అధికారులు, పాలకులు శ్రద్ధ చూపకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీ నిర్మించకపోవడంతో రోడ్డుపైనే మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. సైడ్ కాలువలు లేకపోవడంతో మురికి నీరు పారుతూ రోడ్లు అపరిశుభ్రంగా మారుతున్నాయి. అధికారులు స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విన్నవిస్తున్నారు.

అయితే ఇందిరమ్మకాలనీలో సమస్యలపై కార్పొరేషన్ ఉన్నతాధికారిని సంప్రదించగా ఇందిరమ్మ కాలనీలోని సబ్‌స్టేషన్‌కు వెళ్లే రోడ్డు మంజూరైంది. కానీ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లేకపోవడంతో రోడ్డు వేయడం కాస్త జాప్యం అవుతుందని ఆయన తెలిపారు.



బురదమయంగా అంతర్గత రోడ్డు, రోడ్డుపై నిలిచిన బురద నీరు



సమస్యలు పరిష్కరించండి



ఇందిరమ్మకాలనీలో సౌకర్యాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి సమయాల్లో కాలనీకి రావడానికి చాలా కష్టంగా ఉంది. అంతర్గత రోడ్లు పూర్తిగా లేకపోవడంతో అవస్థలు పడుతున్నాము. సైడ్ కాలువలు లేక మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచి దుర్వాసన వస్తోంది. మా కాలనీలో సౌకర్యాలు కల్పించండి. – ఆరెందుల రమేశ్, ఇందిరమ్మకాలనీ

ఎవరూ పట్టించుకుంటలేరు



పేదలు ఉంటున్న కాలనీలో సమస్యలు వస్తే ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇందిరమ్మ కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. సబ్‌స్టేషన్‌కు వెళ్లే రోడ్డు పూర్తిగా బురదగా మారింది. విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి అత్యవసరంగా విద్యుత్ పరికరాలు తీసుకెళ్లాలంటే వాహనాలు వెళ్లలేని పరిస్థితి. మా కాలనీలో రోడ్లు వేసి మా ఇబ్బందులు తొలగించండి.

– కోనేటి నరేశ్, ఇందిరమ్మ కాలనీ

క్లుప్తంగా

జిల్లాపోటీల్లో కొలనూర్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులు

ఓదెల: పెద్దపల్లిలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి షాట్‌పుట్, డిస్కస్‌త్రో పోటీల్లో మండలంలోని కొలనూర్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జిల్లాస్థాయి షాట్‌పుట్ పోటీల్లో కొలనూర్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న రేండ్ల శ్రావ్యశ్రీ అండర్ 17విభాగంలో, అండర్ 14విభాగంలో రేండ్ల సౌమ్యశ్రీ ప్రథమస్థానంలో నిలిచారు. అదే పాఠశాలకు చెందిన కొలిపాక అశ్విత డిస్కస్‌త్రోలో రెండోస్థానంలో నిలిచింది. విద్యార్థులను హెచ్‌ఎం ఏసుదాసు, పీడీ సదయ్య, గ్రామస్తులు అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల సత్తా



అభినందిస్తున్న కరస్పాండెంట్ ఇస్మాయిల్

పాలకుర్తి: మండలం బసంత్‌నగర్‌లోని ఆలీవర్ ఇంగ్లీష్ మీడియం, జీడీనగర్ గ్రామంలోని యూనివర్సల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల విద్యార్థులు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల కరస్పాండెంట్‌లు జాఫర్‌బేగ్, ఇస్మాయిల్ శనివారం తెలిపారు. జిల్లా కేంద్రంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ జిల్లాస్థాయి పోటీల్లో ఆలీవర్ పాఠశాలకు చెందిన ఈ.శ్రీధర్ అండర్-17 లాంగ్‌జంప్‌లో, జైనోద్దీన్ అండర్-14 షాట్‌పుట్ త్రోలో, అదేవిధంగా యూనివర్సల్ పాఠశాలకు చెందిన బి.సాయి, అక్షయ్ లాంగ్ జంప్ అండ్ 400 మీటర్ల రన్నింగ్, ఈ.అరవింద్ 1500మీటర్ల రన్నింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

నియామకం



రాజబాబు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14 డివిజన్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన తాటికొండ రాజబాబును చేనేత ఐక్య వేదిక జిల్లా సహాయ కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరామోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. రాజబాబును పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం



సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ విజేందర్‌గౌడ్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్ రావును నీరుకుల్ల మాజీ సర్పంచ్ కోటగిరి విజేందర్‌గౌడ్ కలిసి సన్మానించారు. పట్టణంలోని స్వప్నకాలనీలోని ఆయన నివాసంలో శనివారం కలిసి సన్మానించారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు కోటగిరి రమేశ్‌గౌడ్, దాసరి సతీశ్‌గౌడ్, బూరుగు అంజయ్యగౌడ్, పూసాల ఉన్నారు.

ఒలింపియాడ్‌లో గాయత్రి విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో డీఈవో మాధవి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపారు. కాగా శనివారం జిల్లా విద్యాధికారి మాధవి వారిని అభినందించారు. సమ్మర్-2024 ఇండియన్ స్కూల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ బెంగళూరు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్లో పెద్ది సాయితేజ, చాట్ల శ్రీమాన్, రెహాన్, చక్రిక ప్రతిభ చూపారని విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. సర్వశిక్షా అభియాన్ కోఆర్డినేటర్ పీఎం షేక్, కరస్పాండెంట్ రజనీ, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్ ఉన్నారు.

పార్టీ సభ్యత్వం లక్ష్యాలను అధిగమించాలి



మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో నూతన సభ్యత్వం లక్ష్యాలను అధిగమించేందుకు బూత్‌స్థాయి ఇన్‌చార్జిలు పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. పెద్దపల్లిలో శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 50వేలు సభ్యత్వాలు పూర్తయ్యాయని వివరించారు. ఇప్పటివరకు బూత్‌ల వారీగా లక్ష్యాలను అధిగమించిన వారి వివరాలను సేకరించి అన్ని బూత్‌లు వందశాతం లక్ష్యాలను సాధించాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి పోచం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి, నాయకులు వెంకటరమణ, కందుల సంధ్యారాణి, సోమారపు లావణ్య, కాసిపేట శివాజి, పోల్సాని సంపత్‌రావు, రాము పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



సాత్వికను అభినందిస్తున్న హెచ్‌ఎం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం నిట్టూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని అట్ల సాత్విక రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. జగిత్యాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 ఖోఖోపోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సాత్వికను హెచ్‌ఎం లక్ష్మయ్య అభినందించారు. ఈనెల 3, 4, 5వ తేదీల్లో కామారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందని టీచర్లు తెలిపారు.

సుల్తానాబాద్ నుంచి..

సుల్తానాబాద్: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు సుల్తానాబాద్‌కు చెందిన కూకట్ల అఖిల్ ఎంపికై నట్లు ఖోఖో ఖేలో ఇండియా కోచ్ గెల్లు మధుకర్‌యాదవ్ తెలిపారు. ఇటీవల జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం మల్లంపల్లిలో జరిగిన ఉమ్మడి జిల్లా ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కోచ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా అఖిల్‌ను డీవైఎస్‌వో సురేశ్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, కార్యదర్శి అమిరిశెట్టి తిరుపతి తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వైష్ణవి ఎంపిక



వైష్ణవి

ఎలిగేడు: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 68వ ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో అండర్-14 కబడ్డీ బాలికల విభాగంలో పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ధూళికట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భూసారపు వైష్ణవి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సదయ్య, ఫిజికల్ డైరెక్టర్ వి.శ్రీకాంత్ ఉపాధ్యాయులు వైష్ణవిని అభినందించారు.

సమగ్ర కుటుంబ సర్వేపై అవగాహన



కోల్‌సిటీ: సర్వేపై ప్రజలకు వివరిస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం రామగుండం బల్దియా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో మొత్తం 65,847 ఇళ్లు ఉన్నాయి. వీటిని 150 నుంచి 175 వరకు ఉన్న ఇళ్లకు ఒక బ్లాక్ చొప్పున 446 ఎన్యూమరేషన్ బ్లాక్‌లుగా విభజించిన అధికారులు, ఒక్కొక్క బ్లాక్‌కు ఒక్కో ఎన్యూమరేటర్‌కు సర్వే విధులు కేటాయించారు. సర్వే నిర్వహణ తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి 51 మంది సూపర్‌వైజర్లకు కూడా బాధ్యతలు అప్పగించారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శుక్రవారం సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో శిక్షణ ఇచ్చిన అధికారులు, వారికి సర్వే సామగ్రి కూడా ఎన్యూమరేటర్లకు అందజేశారు. ఈ నెల 6వ తేదీ నుంచి సర్వే ప్రారంభం కానున్న నేపథ్యంలో శుక్రవారం నుంచే ఎన్యూమరేటర్ సిబ్బంది హౌస్ లిస్టింగ్ ప్రారంభించారు. సందర్శించిన ఇంటికి ప్రభుత్వం పంపిణీ చేసిన స్టిక్కర్లను అంటిస్తున్నారు.

సుల్తానాబాద్: సర్వే పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ సూచించారు. శనివారం ఇంటింటా కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, రాజమల్లు, మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్ పాల్గొన్నారు.

ఎలిగేడు: మండలంలోని 12 గ్రామాల్లో ఇంటింటా స్టిక్కర్లు అంటించే కార్యక్రమం జరిగింది. గ్రామాల్లో కుటుంబాలను గుర్తించేందుకు ఇంటింటా స్టిక్కర్లు అంటించి సర్వే చేపట్టనున్నారు. కార్యక్రమాన్ని ఎంపీడీవో భాస్కర్‌రావు సందర్శించి, పరిశీలించారు.

జూలపల్లి: సమగ్ర వివరాలతో కుటుంబ సర్వే నిర్వహించాలని ఎంపీడీవో పద్మజ ఆదేశించారు. 13 గ్రామ పంచాయతీల్లో 5215 కుటుంబాలను గుర్తించారు.

బోర్‌వెల్‌కు ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయండి



పాలకుర్తి: మండలంలోని పుట్నూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు వైద్య నరేశ్, తోట ప్రశాంత్, మల్లేశ్ ఎంపీడీవో శశికళను శనివారం కలిసి గ్రామ సమస్యలపై వినతిపత్రం అందించారు. గ్రామంలోని గాంధీనగర్‌లో ప్రధాన రోడ్డును ఆనుకుని ఉన్న బోర్‌వెల్ వద్ద సరైన ప్లాట్‌ఫాం, డ్రైనేజీ సౌకర్యం లేక వర్షపు నీరు నిలిచి దుర్గంధం వ్యాపిస్తోందని వాపోయారు. దీంతో మంచినీటి కోసం బోర్‌వెల్ వద్దకు వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన ఎంపీడీవో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో తీవ్రజ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఐఎన్‌టీయూసీ నేత, మినిమం వేజ్ బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్‌ను రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ శనివారం పరామర్శించారు. ఆసుపత్రికి వెళ్లి ఆయనతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, ముస్తాఫా ఉన్నారు.

విద్యార్థికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్

ధర్మారం: మండలంలోని నల్లలింగయ్యపల్లికి చెందిన సాన రాజేందర్ కుమార్తె సామ శ్రీహిత నిర్మల్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీట్ సాధించింది. కరీంనగర్‌లో శ్రీహితను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శనివారం సన్మానించారు. ఈశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాలయాల్లో పట్టుదలతో చదివి ఎంబీబీఎస్ సీట్ సాధించటం హర్షనీయమని కొనియాడారు. పట్టుదలతో కోర్సు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఆకాంక్షించారు. జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ సలాం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, నాయకులు పానుగోటి యుగేందర్, ఉప్పు రాజయ్య, బోయిని మధు, చంద్రయ్య పాల్గొన్నారు.

ముగ్గురు విద్యార్థుల డిశ్చార్జ్

ముత్తారం: ముత్తారం కస్తూర్బా బాలికల విద్యాలయంలో అస్వస్థతకు గురై హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు విద్యార్థినులు శనివారం డిశ్చార్జ్ అయ్యారు. అక్టోబర్ 27న కేజీబీవీలో 53 మంది విద్యార్థులు అస్వస్థతకు గురి కాగా 50మంది కోలుకున్న విషయం తెలిసిందే. మిగతా ముగ్గురు కోలుకోవడంతో కేజీబీవీ టీచర్లు, బాలికల తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు.

జిల్లా గ్రంథాలయ చైర్మన్‌కు సత్కారం

పాలకుర్తి: జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నియమితులైన అంతటి అన్నయ్యగౌడ్‌ను శనివారం పాలకుర్తి మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పెద్దపల్లిలో జరిగిన కార్యక్రమంలో కలిసిన నాయకులు సత్కరించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య, నాయకులు తలారీ శంకర్, వేల్పుల రాజ్‌కుమార్, మంచినీళ్ల బాబునాథ్, తిరుపతి, చిలగాని రాజేశ్, రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థికి కలెక్టర్ అభినందనలు



తేజస్విరఘును అభినందిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలో నిరుపేద కుటుంబానికి చెందిన సొన్నాయిటంకం సృజన్ తేజస్విరఘు ఎంబీబీఎస్ సాధించగా శనివారం కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. ఇంటివద్దే ఉండి చదువుకుని ఎంబీబీఎస్ సీటు సాధించి తల్లిదండ్రులు రజిత, మల్లేశం కలలను నిజం చేసిన తేజస్వికి కలెక్టర్ మెమొంటో అందించి శాలువాతో సత్కరించారు. బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి తాడూరి శ్రీమన్నారాయణ, కౌన్సిలర్ బూతగడ్డ సంపత్, నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్, కారుపాకల సరోజ, వివేక్, వెంకటేశ్వర్లు, అశోక్, కీర్తి కుమార్ తదితరులున్నారు.

సాక్షి స్పందన



ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట వెలమ సంఘం ఫంక్షన్‌హాల్ సమీపంలో గల గ్రామ పోచమ్మ ఆలయం చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి భక్తులకు ఇబ్బందిగా మారాయి. దీనిపై శనివారం 'సాక్షి' లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. కార్యదర్శి పున్నమయ్య ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బందితో శనివారం ఆలయం చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. భక్తులు, గ్రామస్తులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

కార్మిక కుటుంబాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న లలిత్‌కుమార్

గోదావరిఖని: కార్మిక కుటుంబాల సంక్షేమంపై యాజమాన్యం ప్రత్యేక దృష్టిసారించిందని ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. జీఎం కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.5కోట్లతో కార్మిక వాడల్లోని 23కిలోమీటర్ల రోడ్లను ఆధునీకరించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పనులు టెండర్ దశలో ఉన్నాయన్నారు. గోదావరి తీరంలోని సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద కూడా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సింగరేణి ప్రభావిత, నిర్వాసిత గ్రామాల్లో ఐదు జిమ్‌లు మంజూరు అయ్యాయని చెప్పారు. జీఎం కాలనీ గ్రౌండ్‌లో ఓపెన్‌జిమ్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

ఆర్జీ-1 ఏరియాలో 89శాతం బొగ్గు ఉత్పత్తి

సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-1 పరిధిలో సెప్టెంబర్‌లో 89శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం లలిత్‌కుమార్ వెల్లడించారు. 4.41లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 3.92లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి నిర్దేశిత లక్ష్యాలకు వెనుకంజలో ఉన్నట్లు వివరించారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం రాంమోహన్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, అధికారులు చిలుక శ్రీనివాస్, ఆంజనేయప్రసాద్, ధనలక్ష్మిబాయి, మోహన్‌రావు, ఆంజనేయులు, శ్రీనివాస్, వీరారెడ్డి, వసంతకుమార్ పాల్గొన్నారు.

ఆర్జీ-2లో 79శాతం..

సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-2లో అక్టోబర్‌లో 79శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 9.17లక్షల టన్నుల లక్ష్యానికి గాను 7.25లక్షల టన్నుల బొగ్గుఉత్పత్తి సాధించినట్లు వెల్లడించారు. గడిచిన ఏడునెలల్లో 103శాతంలో నిలిచామన్నారు. వర్షాల కారణంగా ఓవర్ బర్డన్ తొలగింపులో వెనుకబడినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఏరియాకు కేటాయించిన లక్ష్యాలు సాధించడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

అండర్‌గ్రౌండ్ అలవెన్స్ కోత నిలిపివేయాలి

గోదావరిఖని: ఆర్జీ-2 ఏరియా వకీల్‌పల్లి గని కార్మికుల అండర్‌గ్రౌండ్ అలవెన్సుల కోత వెంటనే నిలిపివేయాలని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, కేంద్ర ఉపాధ్యక్షులు చెరుకు ప్రభాకర్ రెడ్డి, కేంద్ర కార్యదర్శి బేతి చంద్రయ్య డిమాండ్ చేశారు. కార్మికులకు సంబంధించి ఐదువేలకు పైగా అండర్‌గ్రౌండ్ మస్టర్లకు సంబంధించిన అలవెన్స్‌లను అక్టోబర్ వేతనంలో కోత విధించడం అన్యాయమన్నారు. కార్మికులకు సమాచారం లేకుండా కోత విధించడం అన్యాయమన్నారు. దీన్ని వెంటనే ఉపసంహరించుకోకుంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుమారుడికి సింగరేణి ఉద్యోగం



శివ

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని పట్టణంలోని మేదరిబస్తీలో నివాసముండే ఫొటోగ్రాఫర్ మోత్కు శ్రీనివాస్, మాధవి దంపతుల కుమారుడు శివ సింగరేణిలో ఫిట్టర్ ఉద్యోగం సాధించి యువతకు ఆదర్శంగా నిలిచాడు. శ్రీనివాస్ కుటుంబం పేదవారైనప్పటికీ కుమారున్ని ఉన్నత స్థానంలో చూడాలనే ఆకాంక్షతో హైదరాబాద్‌లో కోచింగ్ ఇప్పించారు. తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా కష్టపడి చదివిన శివ ఇటీవల జరిగిన సింగరేణి ఫిట్టర్ ఉద్యోగాల పరీక్షల్లో 90శాతం మార్కులతో రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు ఏరియర్స్ చెల్లింపునకు అంగీకారం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికులకు ఒప్పందం మేరకు చెల్లించాల్సిన ఏరియర్స్ 15 రోజుల్లో అందరికీ చెల్లించేలా యాజమాన్యం అంగీకరించిందని ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి, ఎన్టీపీసీ ఎన్సీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా తెలిపారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు అధికారులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వేతన ఒప్పందం అమలులో భాగంగా 871 మందికి ప్రతినెలా రూ.1,020 చెల్లించాల్సి ఉండగా 10నెలలుగా చెల్లించకపోవడంపై యాజమాన్యంతో చర్చించినట్లు పేర్కొన్నారు. ఒప్పందం మేరకు కాంట్రాక్టు కార్మికులకు సంబంధిత కాంట్రాక్టర్లతో ఏరియర్స్ చెల్లించేందుకు ఉత్తర్వులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. రామగుండం రీజియన్ కాంట్రాక్టు వర్కర్స్ కన్‌స్ట్రక్షన్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి భూమల్ల చందర్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

జూలపల్లి: మండలంలోని కాచాపూర్‌లో ఇటీవల అనారోగ్యంతో ఇద్దరు మృతి చెందారు. కాగా వారి కుటుంబాలను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ పరామర్శించారు. కాచాపూర్‌కు చెందిన గండు హన్మయ్య, బైరెడ్డి రుక్కమ్మ ఇటీవల మృతి చెందారు. కాగా వీరి కుటుంబాలను పరామర్శించారు. నాయకులు విసారపు వెంకటేశం, మల్లేశ్‌యాదవ్, మాజీ సర్పంచులు ఆకుల రాజయ్య, ఆడప లక్ష్మన్, బట్టు కొండయ్య, గండు మల్లారెడ్డి, బైరెడ్డి మధుకర్ ఉన్నారు.

రెడ్డి సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ముకుందరెడ్డి

గోదావరిఖనిటౌన్: రెడ్డి సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడిగా కంకణాల ముకుందరెడ్డిని నియమించినట్లు జిల్లా కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాదిపాటు పదవీకాలం ఉంటుందని తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ ఆదేశాలను అనుసరిస్తూ రెడ్డి సంక్షేమ, సమస్యల సాధన కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.